

కారు బోల్తా, మహిళ మృతి

వంగూరు, సెప్టెంబరు 3: అదుపు తప్పి కారు బోల్తాపడి, ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి తండా గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కారులో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఫాతిమ(32) తీవ్రంగా, గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు గాయపడగా, కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలకు
మంచి రోజులు

- బడులకు రానున్న పారిశుధ్య కార్మికులు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ



మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 3: ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు రానున్నాయి. ఇన్ని రోజులు స్కావెంజర్లు లేక పరిశుభ్రత లోపించిన స్కూల్స్ ఇక నుంచి శుభ్రంగా మారనున్నాయి. హైదరాబాద్‌లో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి నిర్వహించిన కృతజ్ఞత సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో పారిశుధ్య కార్మికుల నియామకంతో పాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా పారిశుధ్య కార్మికులను నియమించుకునేందుకు నిధులు మంజూరు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పారిశుధ్య కార్మికులను నియమించనున్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా నియామకం

గతంలో అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లు ఉండేవారు. కొవిడ్ సమయంలో పాఠశాలలు పూర్తిగా మూత పడటంతో గత ప్రభుత్వం వారిని తొలగించింది. అప్పటి నుంచి నియామకం చేపట్టకపోవడంతో పాఠశాలల పరిశుభ్రతను గ్రామ పంచాయితీ, మునిసిపల్ కార్మికలకు అప్పజెప్పారు. వారు స్కూల్స్‌ను పూర్తి స్థాయిలో శుభ్రం చేసేవారు కాదు. 15 రోజులకు ఒక సారి మాత్రమే పనులు చేయడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లేవి. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడేవారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలలకు స్కావెంజర్లు రానున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు వేల మందికిపైగా స్కావెంజర్లు నియమకం కానున్నారు. వీరికి ప్రతీ నేల రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు వేతనం అందించనున్నారు. ఈ నిధులు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు ఇప్పటికే విడుదల అయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	71,689
నాగర్‌కర్నూల్	848	61,658
జోగుళాంబ గద్వాల	472	65635
వనపర్తి	537	42,841
నారాయణపేట	511	59,870
మొత్తం	3,227	3,01,693

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు ప్రతీ నెల మంజూరు కానున్న నిధులు(రూ.ల్లో)

విద్యార్థుల సంఖ్య	నిధులు
1 నుంచి 30	3000
31 నుంచి 100	6000
101 నుంచి 250	8000
251 నుంచి 500	12,000
501 నుంచి 750	15,000
750 పైన	20,000



మహబూబ్‌నగర్ ప్రభుత్వ పోలీస్ లైన్ పాఠశాలలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న డీఈవో(ఫైల్)

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నియామకం



పాఠశాలల్లో స్కావెంజర్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారానే నియమించుకోవాలి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ నుంచి ఎలాంటి నియమక ఉత్తర్వులు ఉండవు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు అయ్యాయి. వాటిని ప్రతీ మూడు నెలలకోసారి వేతన రూపంలో అందించాల్సి ఉంటుంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు, పరిసరాలు శుభ్రం చేసేందుకు అవసరమయ్యే చీపురు కట్టలు, మొదలైనవి స్కూల్ గ్రాంట్స్ ద్వారా తెప్పించాలి.

- ఎ.రవీందర్, డీఈవో మహబూబ్‌నగర్



మట్టిని తవ్వి టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్



మట్టిని తరలిస్తున్న టిప్పర్

అనుమతుల పేర.. అక్రమాలు

- నారాయణపేటలో మట్టి మాఫియా దందా
- మూడు ట్రిప్పులకు అనుమతి పొంది ఎనిమిది ట్రిప్పులు తరలింపు
- రూ.750 డీడీ చెల్లించి రూ.3,000లకు అమ్మకం

నారాయణపేట, సెప్టెంబరు 3: నారాయణపేట జిల్లా కేంద్రంలో మట్టి మాఫియా అక్రమాలకు పాల్పడుతోంది. అనుమతుల పేరిట ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోంది. పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 104లో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. టిప్పర్ మొర్రం కోసం ప్రభుత్వానికి రూ.750 డీడీ కట్టి, తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. ఇదే అదునుగా ట్రిప్పర్ల యజమానులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. ట్రిప్పర్ మొర్రం తవ్వకం, రవాణా ఛార్జీల పేరిట రూ.3,000లకు తగ్గకుండా తీసుకుంటూ, అవసరం ఉన్న వారికి సరఫరా చేస్తున్నారు. దూరం పెరిగే కొద్ది ధరలు పెంచుతున్నారు. మూడు ట్రిప్పులకు అనుమతి పొంది, ఎనిమిది ట్రిప్పుల వరకు మట్టిని తరలిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నారు. గుట్ట తవ్వకాల దగ్గర విధులు నిర్వహించే వీఆర్ఏలకు మామూళ్ల ఇచ్చి, ఇష్టానుసారంగా మొర్రాన్ని తీసుకెళ్తున్నారు. అక్కడ రోజుల తరబడి ఒక్క వీఆర్ఏనే విధులు నిర్వహించడం వల్ల అక్రమాలకు ఆజ్యం పోస్తోంది. కలెక్టర్, తహసీల్దార్ కొత్తగా రావడంతో కింది స్థాయి సిబ్బంది మట్టి మాఫియాతో చేతులు కలిపి, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఇళ్లను నిర్మించుకునే వారికి, గుంతలు పూడ్చుకునే వారికి, వెంచర్‌లకు రోజంతా మొర్రాన్ని సరఫరా చేస్తూ, కాసులు కూడబెట్టుకుంటున్నారు.



నారాయణపేట మెయిన్ రోడ్డులో ప్రమాదానికి కారణమైన మొరం టిప్పర్ వద్ద ఆందోళన చేస్తున్న పట్టణవాసులు(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పట్టణంలో రద్దీగా ఉండే రోడ్లపై హారన్లు కొడుతూ, అతివేగంగా టిప్పర్లను నడుపుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గత జూలై నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. టిప్పర్లలో తరలిస్తున్న మట్టి రోడ్లపై వెళ్తున్న ప్రజలు, ప్రయాణికుల కళ్లలో పడి ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు వేగంగా నడపడం వల్ల మట్టి రోడ్లపైనా పడుతోంది. ట్రిప్పర్లను బైపాస్ శ్యాసన్‌పల్లి మార్గంలో మళ్లించాలని ఎస్పీకి పలువురు నాయకులు వినతి పత్రాలు సమర్పించినా కార్యరూపం దాల్చలేదు. ప్రధాన రహదారి వెంట నడుపుతున్న టిప్పర్ల డ్రైవర్లతో స్థానిక ఎస్ఐ సమావేశమై మెయిన్ రోడ్డులో వాహనాలను వేగంగా నడుపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. అయినా డ్రైవర్లు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతున్నారు. వారి వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహనదారులు, పాదచారులు ఆందోళనకు గురవుతున్నారు. కలెక్టర్ స్పందించి ఈ మట్టి అక్రమ దందాకు చెక్ పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకుంటాం

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాన్‌గల్ మండలంలో దెబ్బతిన్న పంటలు, చెరువుల పరిశీలన



పంటలను పరిశీలించేందుకు బైక్‌పై వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, సెప్టెంబరు 3: రాష్ట్రంలో భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం దవాజిపల్లి, కొత్తపేట, జమ్మపూర్ గ్రామాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న రోడ్లు, తెగిన చెరువులు, కుంటలు, వంతెనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దన్నారు. చెరువులు, కుంటలను మరమ్మతులు చేసి, సాగునీరు అందేలా చూస్తామన్నారు. దెబ్బతిన్న వంతెనలు, రోడ్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి, ఆదుకుంటామన్నారు. మంత్రి వెంట డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.



కొత్తపేట దగ్గర తెగిన వంతెనను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రభుత్వ వైఫల్యంతోనే నష్టం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రమంతా ఈ రోజు అపార నష్టం వాటిల్లిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విపత్తు సంభవించినప్పుడు ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ఎలాంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. కానీ ఈ ప్రభుత్వం ఎలాంటి సోయి లేకుండా, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించు కోలేదన్నారు. ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుంటే ఈ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికి పోయారని నిలదీశారు. ఒక యువ శాస్త్రవేత్త కారులో హైదరాబాద్‌కు వస్తూ నీట మునిగి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె చావుకు ప్రభుత్వమే కారణమన్నారు. ఖమ్మం పట్టణం మునిగిపోయి, అక్కడి యువత ఆక్రోశంతో ప్రభుత్వంపై బూతులు మాట్లాడుతున్నారని, కనీసం సహాయక చర్యలు కూడా చేపట్టడం లేదని అన్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రస్తుత వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రాంతాలు వరదకు అతలాకుతలం అవుతుంటే ప్రతిపక్షంలో కూడా లేని బీఆర్ఎస్ పార్టీ నాటి ఉద్యమ నేత కేసీఆర్ హయాంలో సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరదల్లో చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసి, ఇప్పుడు రూ.5 లక్షలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎంత పంట నష్టం జరిగిందో నివేదిక తెప్పించుకోవాలన్నారు. పరిహారం ఇవ్వడంతో పాటు వరదల్లో మృతి చెందిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షల క్యూసెక్కుల వరద నీరు సముద్రం పాలవుతున్న ఇక్కడున్న రిజర్వాయర్లను నింపకపోవడం దారుణమన్నారు. జిల్లా మంత్రికి కక్ష రాజకీయాలు తప్ప సోయి లేదన్నారు. ఒక్కసారైనా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించారా అని నిలదీశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు.



వీడియో కాల్‌లో మాట్లాడుతున్న నాగం

నిర్లక్ష్యం వల్లే నీట మునిగాయి

- అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, సెప్టెంబరు 3: అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ పంప్‌హౌస్, మోటార్లు నీట మునిగాయని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి మీడియాతో వీడియో కాల్‌లో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు పాలమూరు రంగారెడ్డి పథకంలో ఏర్పాటు చేసిన నాలుగు పంప్‌హౌస్‌లలో మూడోది వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ అని తెలిపారు. రూ.2,437 కోట్లతో కొనుగోలు చేసిన మోటార్లు వరద నీటితో మునిగాయని అన్నారు. వరదలు వస్తే నీళ్ల ప్రవహిస్తాయని కాంట్రాక్టర్‌కు, అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. రిజర్వాయర్ ప్రారంభానికి ముందే ఈ దుస్థితి నెలకొనడం దారుణమన్నారు. మోటార్లు నీట మునగడంతో కొనుగోలు చేసినప్పుడు ఉన్నంత సామర్థ్యంతో పని చేయవని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకుని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

నీటిని తోడే బాధ్యత నిర్మాణ సంస్థదే

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



నీట మునిగిన వట్టెం పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

కందనూలు, సెప్టెంబరు 3: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర శివారులో నిర్మించిన వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ పంపు హౌస్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేశారు. మూడు రోజుల క్రితం ఒకే రోజు 14 సెంటీ మీటర్ల వర్షం కురవడంతో పంప్‌హౌస్‌లోకి నీరు చేరి, ఐదు పంపులు నీట మునిగాయని చెప్పారు. ప్రాజెక్టును నిర్మాణ సంస్థ ఇంకా ప్రభుత్వానికి అప్పగించనందున పంపుహౌస్‌లోని నీటిని ఎత్తిపోసి, పంపులను పూర్వపు స్థితికి తెచ్చే బాధ్యత ఆ నిర్మాణ సంస్థదే అని చెప్పారు. ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారమూ పడదని చెప్పారు. ఇక్కడ ఒక్కో పంపు 2,400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం గలవి 10 బిగిస్తున్నారని, రిజర్వాయర్ సామర్థ్యం 16 టీఎంసీలని తెలిపారు. చిన్నారెడ్డి వెంట పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రూ.500 కోట్లతో కోస్గి అభివృద్ధి

- 2055 సంవత్సరం నాటికి సరిపడేలా సర్వే
- ఎన్‌సీపీఎల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- సూచనలు చేసిన నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి, సెప్టెంబరు 3: కోస్గి బల్దియా అభివృద్ధిపై ఎన్‌సీపీఎల్(నేషనల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఆరు నెలలుగా సర్వే నిర్వహించి, 2055 వరకు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేశారు. అందుకు సంబంధించిన ప్రజెంటేషన్‌ను కోస్గి మునిసిపల్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం తిలకించారు. ఆ ప్రజెంటేషన్‌పై కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు కూడా సూచనలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రతిపాదనలకు అనుమతి ఇస్తే, ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని కలెక్టర్ చెప్పారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

బల్దియాలో ఆక్రమణలు గుర్తించాలి

బల్దియా పరిధిలోని కుంటలు, చెరువులు, కాల్వలు ఆక్రమణకు గురైతే వెంటనే గుర్తించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆక్రమణల వల్లే ఇళ్లల్లోకి నీరు చేరుతోందన్నారు. ఆస్పత్రిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని తెలుసుకున్నారు. పాత ఆస్పత్రి భవనం కూల్చి, ఆ స్థానంలో హాల్, మార్చురీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. గతంలో చేసిన పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేలా రికార్డులు తయారు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.



కోస్గి అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

తొమ్మిదో వార్డులో కలెక్టర్ పర్యటన

మునిసిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో కలెక్టర్ పర్యటించారు. మునిసిపల్ కార్యాలయం ముందు వార్డు సభ్యులు కలెక్టర్ రావాలి.. అంటూ నినాదాలు చేయడంతో ఆమె వచ్చి, సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందన్నారు. కలెక్టర్ వార్డులో తిరిగి, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంపై మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. తక్షణమే ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఈని ఆదేశించారు. కార్యక్రమంలో కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రణాళికలు ఇవీ..

- బల్దియాలో తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.55.27 కోట్లతో శాశ్వత పైప్‌లైన్‌ను కోయిల్‌సాగర్ ద్వారా లేదా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ద్వారా నిర్మాణం.
- రూ.181.19 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు.
- రూ.7.92 కోట్లతో ఉప్పు సముద్రం బందం చెరువు, పరం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌లా ఏర్పాటు.
- 16 వార్డుల్లోని అంతర్గత కాలనీల్లో రూ.53.20 కోట్లతో రోడ్ల నిర్మాణం. కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు.
- రూ.12.77 కోట్లతో పార్కులు, స్టేడియం, బల్దియాపైన మరో రెండు అంతస్తుల భవనం నిర్మాణం.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

BOX OFFICE SHIVA THANDAVAME



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.15,9.30
ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.15
శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30
శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.15,2.30,6.15,9.30

వ్యక్తిపై కేసు నమోదు

గట్టు, సెప్టెంబరు 3 : కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేటీ మల్లేష్ మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో మార్కు అనే వ్యక్తి ధర్మారెడ్డి దగ్గర అప్పుగా రూ. 20వేలు తీసుకున్నాడు. మార్కు ప్రతీ సంవత్సరం వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. అయితే ఇచ్చిన మొత్తంతో పాటు వడ్డీ చెల్లించాలని ధర్మారెడ్డి ఒత్తిడి తెచ్చాడు. ఇబ్బందుల్లో ఉన్నాను 15 రోజుల సమయం కావాలని మార్కు వేడుకోగా, కులం పేరుతో దూషిస్తూ ధర్మారెడ్డి దాడి చేశాడు. అంతటితో ఆగకుండా చంపుతానని బెదిరించాడు. దాంతో తనకు ప్రాణహాని ఉందంటూ మంగళవారం మార్కు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: ఎమ్మార్పీఎస్

గొర్లఖాన్‌దొడ్డికి చెందిన ధర్మారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్, సునందు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధితుడికి మద్దతుగా నిలిచారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.32వేల నగదు స్వాధీనం

గద్వాల, సెప్టెంబరు 3: గద్వాల మండల పరిధిలోని అనంతాపురం గుట్టలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి పేకాట రాయుళ్లు పారిపోతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా వారి వద్ద నుంచి రూ.32వేల నగదుతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

రెండు ఆవుదూడలు మృతి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 3 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంట గ్రామంలో గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో రెండు ఆవు దూడలు మృతి చెందాయి. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన పోరెడ్డి ఉపేందర్‌రెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలంలోని కొట్టంలో ఆవు దూడలను కట్టివేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం పొద్దున్నే వెళ్లి చూడగా రెండు ఆవు దూడలు మృత్యువాతపడ్డాయి. విషయాన్ని గ్రామస్థులకు తెలుపగా, సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్ ఉద య్‌కుమార్‌రెడ్డి, అటవీ శాఖ అధికారులు, ఎనిమల్ టాకర్ ఎల్లయ్య, హనుమంతులు అదేవిధంగా ఏఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కొన్నాళ్లుగా గుర్తు తెలియని జంతువుల దాడుల్లో పశువులు మృతి చెందుతున్నాయని రైతులు చెన్నయ్య, భీమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

జోగుళాంబ గద్వాల జిల్లా

ఇన్‌చార్జి డీఈవోగా రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 3 : జోగుళాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ అధికారిగా మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్‌కు ఇన్‌చార్జి బాధ్యత లు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జా రీ చేశారు. అక్కడ డీఈవో పని చేస్తున్న ఇందిర సెలవుపై వెల్లడంతో రవీందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పంట ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి



రసాయనిక మందు పిచికారి చేయడంతో ఎండిపోతున్న వరిపైరు

గండీడ్ /మహమ్మదాబాద్, సెప్టెంబరు 3: భూతగాదల కారణంగా వరి పంటపై గుర్తు తెలియని రసాయనిక మందు పిచికారి చేయడంతో పంట ఎండిపోతోందని, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు నాగరాజు వేడుకున్నాడు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో కొంతకాలంగా రామ్‌చందర్‌జీ అనే వ్యక్తికి తనకు భూతగాదాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం రాసుకున్నట్లు తెలిపాడు. తన భాగంలో వరి నాటు వేసుకోగా పంటను రామచందర్‌జీ ధ్వంసం చేశాడని వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా గతనెల 21న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మళ్లీ వరి పైరు కుళ్లిపోవాలని గుర్తు తెలియని రసాయనిక మందు పిచికారి చేశాడని ఆందోళన వ్యక్తం చేశాడు. పంట అంతా వాడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు నాగరాజు కోరారు.

వినాయక చవితి శుభాకాంక్షలతో
ఈ నెల 7న బ్రహ్మాండమైన విడుదల




దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

వినాయక చవితి శుభాకాంక్షలతో
ఈ నెల 6న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.15,2.30,6.00,9.30
సంధ్య 35 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
సంధ్య 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00 am | శాంతి 70 - నారాయణగూడ 6.00 pm



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00am
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.30am
పివిఆర్ - ఎర్రమంజిల్ 7.15pm
గలేరియా - పంజాగుట్ట 10.55am
SHIVA SAI FILMS

వినాయక చవితి శుభాకాంక్షలతో
ఈ నెల 6న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES THRO GANESH BHARI

సెప్టెంబర్ 5న బ్రహ్మాండమైన విడుదల



విమల్ 70ఎంఎం ఎ/సి - బాలానగర్
64channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditioned
సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ | జగదాంబ 70 - ఘట్‌కేసర్ 7.40am | రాజధాని 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

బైకును ఢీకొన్న కారు

- ఒకరి దుర్మరణం



వెంకటయ్య (ఫైల్)

చారకొండ, సెప్టెంబరు 3: బైకును కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లిలో దేవరకొండ-కల్వకుర్తి జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. జూపల్లి గ్రామానికి చెందిన కడారి వెంకటయ్య (45) మంగళవారం ఉదయం శ్రీశైలం ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకులో డిజిల్ పోయించుకొని తిరిగి తన ఇంటికి వస్తుండగా జూపల్లి సమీపంలోనే కల్వకుర్తి నుంచి అతివేగంగా వచ్చిన కారు వెంకటయ్య బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- నలుగురికి గాయాలు

వంగూరు, సెప్టెంబరు 3: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో కల్వర్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అల్మాస్‌గూడకు చెందిన యుగేంధర్‌రెడ్డి, మల్లారెడ్డిలతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్దిలేశ్వరి మాత విగ్రహం ఊరేగింపు



అమరచింతలో మద్దిలేశ్వరి మాత ఊరేగింపులో పాల్గొన్న పద్మశాలీలు

అమరచింత, సెప్టెంబరు 3: వనపర్తి జిల్లా అమరచింత మునిసిపాలిటీలో వెలసిన మద్దిలేశ్వరి మాత ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పద్మశాలీల ఆరాధ్య దైవమైన మద్దిలేశ్వరి మాత విగ్రహాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయం ఆవరణంలో ఉన్న పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో మొదట పద్మశాలీలు పూజలు చేశారు. అనంతరం మాత విగ్రహాన్ని పల్లకిలో ఉంచి కథలు పాడుతూ పద్మశాలీలు శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం మద్దిలేశ్వరి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహంకాళి విష్ణు, మహంకాళి ప్రభాకర్, దేవరకొండ లచ్చన్న, తాటికొండ రమేష్, చింతన్న, ఎం.కృష్ణ, కమిటీ సభ్యులు కొంకతి రాజు, మహంకాళి సత్యనారాయణ, తిరుమల సత్యనారాయణ, రఘు, కురుమన్న, నరసింహ , చిలువరి రాములు, చిన్ని రమేష్, కొంగరి రవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోయిల్‌సాగర్ నీటి విడుదల



కోయిల్‌సాగర్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

దేవరకద్ర, సెప్టెంబరు 3: మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో ఉన్న కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 31. 6 అడుగులు ఉంది. అంకిళ్ల వాగు నుంచి నీరు రావడంతో 4 గేట్ల ద్వారా, 2,800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు పరిసరాలు, అందాలను తిలకించేందుకు సందర్శించుకులు ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చారు.

ముసురు వర్షాలకు కూలిన ఇళ్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్ నాగరాజు

ఆత్మకూరు,సెప్టెంబరు 3: ముసురు వర్షాలు కురుస్తున్న కారణంగా ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాలలో ఎనిమిది ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. ప్రజలు అప్రమత్తమై పక్క ఇళ్లలో నిద్రిస్తున్న కారణంగా ప్రాణ నష్టం జరగలేదు కానీ కొంత ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు ఎనిమిది ఇళ్లను గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు నష్టపరిహారం చెల్లించనున్నట్లు కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ రాజు తెలిపారు.

ప్రమాదకర స్థితిలో సూగూరు చెరువు

- అలుగును తెంపిన గ్రామస్థులు



సూగూరు అలుగు నుంచి కిందకు వెళ్తున్న నీరు

పెబ్బేరురూరల్, సెప్టెంబరు 3: మండలంలోని సూగూరు గ్రామ నల్ల చెరువు ప్రమాద స్థితికి చేరుకోవడంతో గ్రామస్థులు అలుగును తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గించారు. సూగూరు గ్రామ పై భాగం రంగసముద్రం గేట్లు ఎత్తడంతో వరద నీరు చెరువులోకి భారీగా రావడంతో గ్రామస్థులు అప్రమత్తమై అలుగు ఎత్తును తగ్గించారు. చెరువుకు 12 అడుగుల నీరు నిల్వ ఉండగా రెండు అడుగుల మేరకు అలుగును తొలగించారు. దీంతో పాటు చెరువు కట్ట నాసిరకంగా ఉందని, ఒక వేళ చెరువు కట్ట తెగిపోతే కింది ఉన్న సూగూరు గ్రామం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు చెప్పారు. అధికారులు స్పందించి ఈ వేసవిలో చెరువు కట్టను పటిష్టం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

పాన్‌గల్, సెప్టెంబరు 3 : మండలంలోని బహదూర్‌గూడెంలో మంగళవారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు, సీజనల్ వ్యాధు లపై తమ ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగీ, మలేరియా లాంటి దోమకాటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆట పాటల ద్వారా చైతన్య పరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పాఠశాల హెచ్‌ఎం, కళాకారులు గుడిసె శివలింగం, శ్రీనివాస్, డప్పు నరసింహ, డి.కృష్ణయ్య, బోనాసిరాజు, ఎస్, సువర్ణ, ఎం. రాధ తదితరులు పాల్గొన్నారు.

నక్కలగండికి ప్రయాణ ఇబ్బందులు

- 50 మీటర్ల ప్రయాణానికి రూ.50

- పదేళ్లు దాటినా ప్రత్యామ్నాయ మార్గం లేని గ్రామం



ప్రధాన రహదారిపైకి నక్కలగండి బ్యాక్‌వాటర్ రావడంతో ట్రాక్టర్‌పై వెళ్తున్న ప్రయాణికులు

అచ్చంపేట, సెప్టెంబరు 3 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని నక్కలగండి నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో ఓ కొలిక్కి రాకుండానే ప్రాజెక్టు దిగువన ఉన్న బక్కలింగాయపల్లి, అక్కారం, దేవులతండా, అంజనేయతండా, బండమీదితండా, ఘణపూర్ గ్రామాల ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. డిండి ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో ముంపు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఈ గ్రామాల మీదుగా మాత్రమే ఆయా గ్రామాలకు దారి ఉండటంతో గత రెండురోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో పాఠశాలలు మూసివేశారు. ఉద్యోగులు ఎవరూ వెళ్లడం లేదు. ప్రస్తుతం డిండి ప్రాజెక్టు నిండి ప్రవహిస్తుండడంతో నక్కలగండి



అక్కారం గ్రామ వ్యూ

ముంపు గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది. ఎస్‌ఎల్‌బీసీ టన్నల్ పనులు పూర్తయ్యి ఈ ప్రాజెక్టులోకి నీరు చేరితే నక్కలగండితండా, మార్లపాడుతండా, కేశ్యతండా, మన్నెవారిపలి తండాలు జలదిగ్బంధంలో మునిగిపోతాయి. ఇదిలా ఉంటే ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని తెలిసినా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో 50 మీటర్ల మేర డిండి ప్రాజెక్టు వరదనీరు నిలిచిపోవడంతో గ్రామాలకు మానవ సంబంధాలు తెగిపోయాయి. అత్యవసర పనుల మీద 50 మీటర్ల మేర విస్తరించి ఉన్న వరద నీటిలో ప్రయాణం చేయాలంటే ఒక్కో మనిషికి రూ.50 ఇవ్వాల్సిందే. ద్విచక్ర వాహనాన్ని దాటించాలన్నా రూ.వంద చెల్లించక తప్పదు. ఆరు ఫీట్ల లోతు మేర ఉన్న నీటిలో ట్రాక్టర్ ద్వారా ప్రయాణికులను చేరవేస్తున్నారు. పదేళ్లుగా నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నా.. దిగువ గ్రామాల ప్రజల రాకపోకల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే తమ కష్టాలు గుర్తొస్తాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు తీవ్ర అంతరాయం



ఆత్మకూర్- మదనాపురం రహదారిపై ప్రవహిస్తున్న వరద

మదనాపురం, సెప్టెంబరు 3: మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు సైఫన్ల నుంచి నీరు దిగువకు వెళ్తుంది. అదేవిధంగా శంకరసముద్రానికి భారీగా వరద రావడంతో గేట్లను ఎత్తారు. దాంతో మండలంలోని మదనాపురం, ఆత్మకూర్ రహదారిలో కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుండడంతో మంగళవారం మూడో రోజు కూడా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగింది. రామన్‌పాడు ప్రాజెక్టుకు నిలకడగా వరద వస్తుండడంతో రెండు గేట్లు ఎత్తి 8వేల క్యూసెక్కులకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలో రెండు ఇళ్లు వర్షానికి కూలిపోయాయి.

తెగిన రామన్‌పాడు కాల్వ



రామకృష్ణాపూర్ సమీపంలో తెగిన రామన్‌పాడు కాల్వ

కొత్తకోట, సెప్టెంబరు 3: వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని రామన్‌పాడు కాల్వ తెగిపోయిన మంగళవారం తెగిపోయింది. రామకృష్ణాపూర్ సమీపంలో పామాపురం వైపున కాల్వకు భారీగా నీరు రావడంతో కాల్వపై నీరు ఎక్కి పారి తెగిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఇరిగేషన్ శాఖ అధికారులకు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

వర్షానికి గొర్రెలు, మేకలు మృతి

రాజాపూర్, సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ముదిరెడ్డిపల్లిలో పాలకొండ యాదయ్యకు చెందిన 8 మేకలు, 7 గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మండల రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులకు వినతిపత్రం అందజేశారు. విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పశుసంవర్ధక శాఖ మండల అధికారి కార్తిక్ తెలిపారు.

ట్రాక్టర్ సీజ్

రాజాపూర్, సెప్టెంబరు 3: కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ట్రాక్టరు ఇంజన్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే.రవి మంగళవారం తెలిపారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి, రాజాపూర్ మధ్యలోని దుందుబీ వాగులో అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ట్రాక్టర్ ఇంజన్‌ను గస్తిలో ఉన్న కానిస్టేబుల్‌లు సుదర్శన్, శంకర్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కృత్రిమ ఇసుక తయారు చేసిన వారిపై చర్యలు తీసుకుంటమని ఎస్సై పేర్కొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీ



లాడ్జీలో రికార్డు తనిఖీ చేస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 3: జిల్లా కేంద్రంలోని పలు లాడ్జీలను సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బంది తనిఖీ నిర్వహించారు. లాడ్జీల్లోని రికార్డులను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి అనుమానంగా ఉంటున్న వానిఇ అదుపులోకి తీసుకుని విచారించారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కొత్తపల్లి, సెప్టెంబరు 3 : రోడ్డు పక్కకు ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. త్రుటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ కోతకు గురయ్యాయి. మంగళవారం ఉదయం మహబూబ్‌నగర్ నుంచి మద్దూరు వెళ్తున్నా ఆర్టీసీ బస్సు, మద్దూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న బస్సును క్రాస్ చేసే క్రమంలో కొత్తపల్లి మండలం ఎక్కమేడ ప్రభుత్వ పాఠశాల మూలమలుపు దగ్గర ఒకసారిగా రోడ్డు కిందకు దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, మరింత ముందుకు వెళ్లుంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చర్చించుకున్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డెలివరీ మెయిన్స్ వద్ద ప్రమాదం

- వేగంతో కూడిన గాలి, నీటి తాకిడితో దుర్ఘటన

- పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడి దుర్మరణం

- మృతదేహం జిల్లా ఆసుపత్రికి తరలింపు

కొల్లాపూర్, సెప్టెంబరు 3 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ శివారులో కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు డెలివరీ మెయిన్స్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుడు దుర్మరణం చెందాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు డెలివరీ మెయిన్స్ వద్ద రోజు వారిగానే మంగళవారం కూడా పనులు కొనసాగుతుండగా ఆకస్మాత్తుగా పంపు నుంచి వేగంతో కూడిన గాలి, నీరు బయటకు ఉప్పొంగడంతో పైపునకు ఎదురుగా ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన బిశ్వనాథ్(40) ఆ గాలి నీటి తాకిడికి దాదాపు 150నుంచి 200మీటర్ల దూరంలో ఎగిరిపడడంతో కడుపుపై తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలంలోనే కార్మికుడు దుర్మరణం చెందాడు. సంఘటన జరిగిన ప్రదేశంలో మరో ఐదుగురు కార్మికులు కూడా ఉన్నట్లు సమాచారం. వారంతా పైపునకు ఇరువైపులా గోడ పక్కన ఉండడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. పైపునకు ఎదురుగా ఉన్న బిశ్వనాథ్ మాత్రమే ప్రమాదంలో మృతి చెందాడని కొల్లాపూర్ ఎస్‌ఐ రుషికేష్ పేర్కొన్నారు. డెలివరీ మెయిన్స్ నుంచి నీరు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రాజెక్టు అధికారులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కంపెనీ ప్రతినిధులు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మృతుడికి కుటుంబీకుడైన మరో కార్మికుడు కూడా ఈప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పెచ్చులూడుతున్న పోలీస్‌స్టేషన్ పైకప్పు



జలదిగ్బంధంలో ఉన్న పోలీస్ స్టేషన్



పెచ్చులూడిన రిసెప్షన్ గది పైకప్పు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరింది. స్టేషన్‌లో రిసెప్షనిస్టు గది, కంప్యూటర్ గది వర్షాకాలంలో తరచుగా పెచ్చులూడుతుంది. వారం క్రితం కంప్యూటర్ గదిలో రైటర్ విధులు నిర్వహిస్తుండగా పెచ్చులు ఊడిపడ్డాయి. 25 ఏళ్ల క్రితం మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఎత్తు ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు భవనం నిర్మించారు. ప్రధాన రహదారి బీటీ రోడ్డు ఎత్తు పెరగడంతో కొంచెం వర్షం పడినా పోలీస్ స్టేషన్ జలదిగ్బంధంలో ఉంటుంది. పోలీస్ స్టేషన్ చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి అమ్మడంతో పాటు చిన్నపాటి పాటు కాల్వలను ఆక్రమించి కంచెలు వేయడంతో స్టేషన్ ఆవరణలో నిలిచిన వరద నీరు బయటికి వెళ్లడం లేదు. పోలీసులు కాల్వలు తీస్తేనే వర్షపు నీరు నిల్వకుండా ముందుకు వెళ్తుంది. స్టేషన్ ఆవరణంలో సిబ్బందికి ఉన్న క్వార్టర్స్ సైతం శిథిలావస్థకు చేరాయి. కొత్తగా భవనం నిర్మిస్తే బావుంటుందని సిబ్బంది కోరుతున్నారు.

ఉమామహేశ్వరంలో జలధార

- లింగ దర్శనం రద్దు

- నిత్యాన్నదానం, పాపనాశనం దారులు మూసివేత



కొండపై నుంచి జాలువారుతున్న నీరు

అచ్చంపేట, సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమామహేశ్వర క్షేత్రంలో కొండల నుంచి పెద్దఎత్తున జలధారలు ఎగసి పడుతుండటంతో అధికారులు రంగాపూర్ వద్దనే దారి మూసేశారు. మంగళవారం కూడా జలపాతం కొండల నుంచి జాలు వారుతుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆలయ దర్శనం మినహా లింగ దర్శనానికి అనుమతించ లేదు. అదే మాదిరిగా పాపనాశనం వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండు రోజుల నుంచి నిత్యాన్నదానం, ఫలహారాల తయారీ నిలిపివేశారు. దీంతో ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. జలధారలు పూర్తిగా తగ్గిన తర్వాతనే భక్తులను అనుమతించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

నీట మునిగిన పంటలు



అమరచింత శివారులో మునిగిన వరి పంటను చూస్తున్న దివ్యాంగ రైతు మన్నన్

అమరచింత, సెప్టెంబరు 3: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పంటలు, ఇళ్లు నీట మునిగిపోయాయి. అమరచింతతో పాటు పలు గ్రామాల్లో కుంటలు చెరువు పక్కన ఉన్న పంట పొలాలు నీట మునిగిపోయాయి. అమరచింత పెద్ద చెరువుకు భారీ స్థాయిలో నీరు చేరడంతో అలుగు పారుతుంది. పెద్ద చెరువు అలుగు పారడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు మునిగిపోయాయి. ముఖ్యంగా పట్టణ శివారులోని రైతుల వరి, చెరకు పంటలు నీట మునిగాయి. అదేవిధంగా ఇళ్లు కూడా కూలిపోయాయి. అధికారులు స్పందించి మునిగిన పంట, కూలిన ఇళ్లను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని స్థానికులు కోరుతున్నారు.



అమరచింత పెద్ద చెరువు అలుగు

సమన్వయంతో నష్టం తీవ్రతను తగ్గించగలిగాం

- భారీ వర్షం కురిసినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనిచేశాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 3 : పాలమూరులో చాలా ఏళ్ల తరువాత భారీ వర్షం కురిసిందని, అధికారులు సమన్వయంతో పని చేయడం వల్ల నష్ట తీవ్రతను చాలా తగ్గించగలిగామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒకేరోజు 12 సెంటీమీటర్ల వర్షం కురిసిన చరిత్ర ఇంతకుముందు లేదని అన్నారు. గతంలో చిన్నపాటి వర్షం కురిస్తేనే ఎన్నో కాలనీలు ముంపునకు గురై తీవ్ర నష్టం జరిగేదని, ఇప్పుడు భారీ వర్షం కురిసినా అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమష్టితో పనిచేయడం వల్ల నష్ట తీవ్రతను చాలా తగ్గించగలిగామని అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పడంతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ముందుగానే క్షేత్రస్థాయికి వెళ్లి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనావేస్తూ నీటిని మళ్లించే పనులు చేశామన్నారు. తెల్లవారుజాము 4 గంటల నుంచే మునిసిపల్ చైర్మన్, కార్యకర్తలు, కౌన్సిలర్లు, అధికార యంత్రాంగం రోడ్లపైకి వచ్చి ఎక్స్‌కవేటర్‌ల సాయంతో కాల్వలు తీయించి నీటిని మళ్లించే కార్యక్రమాలు చేయడం వల్ల ఈరోజు పాలమూరు ప్రజలు క్షేమంగా ఉన్నారన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవోలు అంతా పనిచేశారని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గతంలో మాదిరిగా ఫొటోలకు ఫోజులు ఇవ్వకుండా ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేశామని స్పష్టం చేశారు. పాలమూరు భవిష్యత్ తాగునీటి అవసరాలు అంటే 2053 నాటికి తాగునీటి సమస్య లేకుండా అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇంకా వర్షాలు ప్రమాదం పూర్తిగా తొలగలేదని, రానున్న రోజుల్లో భారీ వర్షాలున్నాయని చెబుతున్నారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. దయచేసి ప్రజలు చెరువులు, కుంటలు కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దని, భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులు లేకపోతే కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. జిల్లాలో 2014 నుంచి చెరువులు, కుంటలు ఎక్కడెక్కడ కబ్జాకు గురయ్యాయో అధికారులు వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. 523 సర్వే నెంబర్‌లో ఆక్రమణల కూల్చివేత విషయంలోనూ అధికార యంత్రాంగం విచారణ చేసి చర్యలు తీసుకుందని, ఎవరైనా పేదలకు అన్యాయం జరిగితే వారికి న్యాయం చేస్తామని అన్నారు. ఈ వ్యవహారంలో పేదలకు భూములు అమ్ముకున్న వారిపైనా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం విచారణ చేసి చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వినోద్‌కుమార్, ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 3 : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు అన్నివర్గాల వారు సహకారం అందించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణకు ఆయా శాఖల తరఫున పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పోలీస్ బందోబస్తు వంటి ఏర్పాట్లను ఆయాశాఖల అధికారులు గతంలో మాదిరిగా ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించే విధంగా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేచోటా గజ ఈతగాళ్లతో పాటు క్రేన్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరు ఎలాంటి సంఘటనలు జరగకుండా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. పోలీసు శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులను ఉపయోగించాలని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. మండపాల ఏర్పాటుకు నూటికి నూరు శాతం ఆన్‌లైన్ అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన శానిటేషన్ చర్యలు చేపట్టాలని కోరారు. రహదారుల మరమ్మతులు చేయించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, నిమజ్జనం రోజున క్లాక్ టవర్ వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. పట్టణంలో కుక్కలు, పందుల వంటివి లేకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, అదనపు ఎస్పీ రాములు, డీఆర్‌వో రవికుమార్, ఆర్డీవో నవీన్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, నల్లవెల్లి కురుమూర్తి, వీరబ్రహ్మాచారి, వనగంటి శంకర్, వసంత వెంకటేశ్, రామచంద్రయ్య సాయిబాబా, ఈద్గా కమిటీ అధ్యక్షుడు తఖీ హుస్సేన్, రఫీక్ అహ్మద్, మహ్మద్ సాదిక్ హుస్సేన్, మీర్జాబేగ్, హఫీజ్ ఇద్రిస్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దళిత ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం చేస్తారా ?

పాలమూరు, సెప్టెంబరు 3 : ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటంలో అన్యాయం చేస్తారా ? అని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(621)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, గంగాధర్, రామకృష్ణలు ప్రశ్నించారు. మంగళవారం విద్యుత్ భవన్ ఎదుట రెండోరోజు విద్యుత్ భవన్, సర్కిల్ కార్యాయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వివాదాస్పదమైన టీ.ఓ.ఓ.954, ఎస్.ఓ.ఓ.37, ఎస్.పీ.ఓ.ఓ.101, టీ.జీ.ఓ.ఓ.62 ఆర్డర్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. క్యాన్సిక్వెన్షియల్ సీనియారిటీని కొనసాగించాలన్నారు. ఆర్జిజన్ల డిమాండ్స్ కన్వర్షన్ అండ్ ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. విద్యుత్ సంస్థ యాజమాన్యం స్పందించి తక్షణమే దళిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నీలకంఠస్వామి అనుగ్రహం అందరిపై ఉండాలి

- స్వామి శోభాయాత్రలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


గండీడ్ : వెన్నాచేడ్ వెన్నెల ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 3 : నీలకంఠ స్వామి వారి అనుగ్రహం అందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వీరన్నపేటలో కొలువైన శ్రీ నీలకంఠ స్వామి వారి శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన శోభయాత్రలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్ అంజయ్య, బుద్దారం సుధాకర్‌రెడ్డి, కృష్ణ, కోట్ల చంద్రయ్య, లీడర్ రఘు, చందు, డి.కె. ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

గండీడ్ : ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ముఖ్య వక్తలు రామ్మోహన్, నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలోని ఆంజనేస్వామి దేవాలయంలో శ్రావణమాసం మొదటి నుంచి అమావాస్య వరకు ప్రతీ రోజు తెల్లవారు జామున 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి మంగళవారం 108 సార్లు 108 టెంకాయలు కొట్టి హనుమాన్ చాలీసాను ముగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బోయిని గోపాల్, విశ్రాంత ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, రాములు, నారాయణరెడ్డి, వి.మల్లప్ప, బాలవర్ధన్‌రెడ్డి, సుభాష్, వెంకటయ్య, కృష్ణయ్య, నిరంజన్, నర్సింములు, అంజిలయ్య పాల్గొన్నారు.


దేవరకద్ర : రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా రంగనాయక స్వామి రథోత్సవం

దేవరకద్ర : మండల పరిధిలోని వెంకటాయపల్లి గ్రామంలో వెలిసిన శ్రీరంగనాయక స్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామిని తేరుపై ఉంచి గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ దేవత బోనాలు

దేవరకద్ర : దేవరకద్ర మండల పరిధిలోని బల్సుపల్లి వెంకటాయపల్లి గ్రామంలో మంగళవారం బోనాల పండుగను పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో మహిళలు సాయంత్రం మట్టికుండలో భక్తిశ్రద్ధలతో తయారు చేసిన బోనం కుండలను మహిళలు తలపై పెట్టుకొని డబ్బు చప్పుళ్ల, ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకొని చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొండోని చెరువుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

కోయిలకొండ/ దేవరకద్ర/ అడ్డాకుల/ జడ్చర్ల/ మిడ్జిల్/ హన్వాడ, భూత్పూర్/ మూసాపేట, సెప్టెంబరు 3 : కోయిలకొండ మండలంలోని దమాయపల్లిలోని కొండోని చెరువుకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం దమాయపల్లిలోని కొండోని చెరువు, గణపతిరాయుని చెరువును పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి మధుసూదన్‌గౌడ్ ఇరిగేషన్ ఎస్‌ఈ చక్రధర్, ఈఈ వెంకటయ్య, పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజా గణేష్ ఎంపీడీవో కాళప్ప, డిప్యూటీ ఈఈ వెంకటణ రమేష్ ఏఈ పరశురాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, హన్మంతు పాల్గొన్నారు. ● కోయిలకొండ మండలం దమాయపల్లిలోని కొండోని చెరువును సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఇసుక మేటలు పెట్టిన రైతులకు రూ.25 వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాములు, కురుమూర్తి, గాలెన్న, వెంకటయ్య తిరుమలయ్య పాల్గొన్నారు. ● జడ్చర్ల మండలంలోని కోడ్గల్ వెళ్లే దారిలోని గోప్లాపూర్ నుంచి లింగంపేట మధ్య దారిలో ఉన్న ప్రధాన రహదారిపై గంజివాగు పారుతుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోడ్గల్ కాంప్లెక్స్ పరిధిలోని కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం గ్రామస్థులు పంపిన ట్రాక్టర్‌లో ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లారు. ఆల్వాన్‌పల్లి నుంచి తంగెళ్లపల్లి, గుట్టకాడిపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిపై వరద నీరు పారుతుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వరద నీటిలో చేపలు పట్టేందుకు సమీపంలోని గ్రామాల యువకులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మరికొందరు పోటీ పడ్డారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని బోయిలకుంట్లకు వెళ్లే దారిలో నాలా దెబ్బతినడం, మునిసిపల్ కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్లు పరిశీలించి, తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ● మిడ్జిల్‌లోని కేజీబీవీలో వర్షపునీరు చేరగా, ఏఎంవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. 3, 6, 9వ తరగతి విద్యార్థులను ఎన్ఏఎస్ పరీక్షలకు సంసిద్ధులను చేయాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ నర్సిములు, కేజీబీవీ అధ్యాపక బృందం ఉన్నారు. ● హన్వాడ మండలం మునిమోక్షం గ్రామంలో ఇటీవల వానలకు ఇల్లు కూలిన అనంతయ్యకు బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు గ్యాస్ సిలిండర్, బియ్యం, సరుకులను అందించారు. పుల్పానికుంటకు రంధ్రం పడింది. ● భూత్పూర్ మండలం తాటిపర్తి, కొత్తూరు, శేరిపల్లి, పోతులమడుగు, అన్నాసాగర్, కప్పెట, హస్నాపూర్, తాటికొండ తదితర గ్రామాల్లో సుమారుగా 9ఇళ్లు కూలిపోయాయి. పోతులమడుగు, కప్పెట, కర్వెన, హస్నాపూర్, శేరిపల్లి (హెచ్), కొత్తూరు, గ్రామాల శివారుల్లో ఉన్న కొన్ని ప్రాంతాల్లో వరి, పత్తి, ఇతర పంటలు సుమారుగా 55ఎకరాల్లో నీట మునిగాయి. అధికారులు పరిశీలిసునాన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి శివారులో ఉన్న కోమటికుంట చెరువుకు గండిపడింది.

మూసాపేటతో పాటు సంకలమద్ది, వేముల, నిజాలాపూర్, జానంపేట తదితర గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జానంపేట, గంగారం చెరువు కాలువకు గండిపటడంతో పరిసరాల్లో సాగుచేసిన వరిపంట చేన్లు పూర్తిగా మునిగిపోయాయి.


భూత్పూర్ : తాటిపర్తిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి


కోయిలకొండ : కొండోని చెరువు కట్టను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు


కోయిలకొండ : దమాయపల్లి చెరువు అలుగును పరిశీలిస్తున్న కలెక్టర్


జడ్చర్ల మండలం లింగంపేట సమీపంలో పారుతున్న గంజివాగులో నుంచి ట్రాక్టర్‌లో పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులు


జడ్చర్ల మండలం తంగెళ్లపల్లి వెళ్లే దారిలో పారుతున్న వరద నీటిలో చేపలు పడుతున్న యువకులు, స్థానికులు

గ్రామీణ ప్రజలకు వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మ

నవాబ్‌పేట, సెప్టెంబరు 3 : వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మొదటిసారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంటువ్యాధుల విజృంభనపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అంతకుముందు లేబర్, ల్యాబ్, ఫార్మసిరూంలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మ వెంట వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

- మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్

జడ్చర్ల, సెప్టెంబరు 3 : కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఎన్నుకున్నారు. కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో కార్మికులకు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా బాగి కృష్ణయాదవ్, అధ్యక్షుడిగా నరసింహ, ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు, ఉపాధ్యక్షులుగా మణెమ్మ, శివలీల, సహాయ కార్యద ర్శులుగా భార్గవి, నవీన్, కోశాధికారులుగా పద్మ, శేఖర్, కార్యవర్గ సభ్యులుగా రవి, అలివేలు, చెన్నమ్మ, అలివేలమ్మ, సభ్యులుగా నీరజ, అంజమ్మ, యాదమ్మ, మంగమ్మ, అలివేలు, సత్యమ్మ, రామకృష్ణ, వినయ్, టోనీ, ఇసాక్‌లను ఎన్నుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రాజాపూర్, సెప్టెంబరు 3 : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రభుత్వం నుంచి వచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు రెవెన్యూ, మండల పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీవో మచ్చేచందర్, నాయకులు దుష్యంత్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విక్రమ్‌రెడ్డి, యాదయ్య కృష్ణయ్య, గోనెల రమేష్, శ్రీధర్ రెడ్డి, రమణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

అడ్డాకుల, సెప్టెంబరు 3 : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాధితులకు మండల పరిధిలోని కాటవరం, మండల కేంద్రంలో అందజేశారు. కాటవరానికి చెందిన ఈడిగి శ్రీనివాసులుకు రూ.15000, జర్పుల హేమ్లికి రూ.10వేల విలువ చేసే చెక్కులను అందజేశారు. అదేవిదంగా మండల కేంద్రంలోని పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం కాటవరం చెరువు అలుగుపారుతుండడంతో జలపూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు

నీటి సమస్య పరిష్కారానికి కృషి

గండీడ్, సెప్టెంబరు 3 : నీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సూర్‌పల్లి గ్రామంలో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే బోరు వేయమని ఆదేశించడంతో మంగళవారం ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి నిధులతో బోరు డ్రిల్ వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కూడా నీటి సమస్య ఉంటే తప్పకుండా తీర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుగ్గయ్య, తిరుపతయ్య, రఘు, శ్రీను గ్రామ కార్యదర్శి సందర్య పాల్గొన్నారు.

బాధితులకు సరకులు పంపిణీ

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 3 : క్రిస్టియన్‌పల్లిలో 523 సర్వేనెంబర్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు 523లో రిలేదీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లి వారికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇళ్లను కూల్చివేసి ఆరు రోజులు అవుతుందని నిర్వాసితులైన బాధితులను ఇప్పటివరకు ప్రభుత్వం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కుంటున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మూడ్రోజులుగా ఆహారం అందించామని, ఇప్పుడు వండుకోవడానికి సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. న్యాయం జరిగే వరకు బాధితులకు బీఆర్‌ఎస్ అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంజి ఎంకన్న, శివరాజు, తాటి గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, పల్లె రవి, కిషన్‌పవార్, రామకృష్ణ, గణేష్‌యాదవ్, రాజు రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటరు లిస్టు సర్వేను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మిడ్జిల్, సెప్టెంబరు 3 : మండలంలోని అన్ని గ్రామాలలో ఓటరు లిస్టు సర్వేను త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 247వ పోలింగ్ బూత్‌లో సర్వే పనులు చేపడుతున్న సిబ్బంది పనితీరును ఆయన తనిఖీ చేశారు. ఓటరు లిస్టులో చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. తప్పులుగా ఉన్న పేర్లు, ఫొటోలను సరిచేయాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజునాయక్, బీఎల్‌వోలు ఉన్నారు.

'ఎర్రకుంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

మిడ్జిల్, సెప్టెంబరు 3 : మిడ్జిల్ గ్రామ శివారులోని 89, 90/1, 90/2, 67 సర్వేనెంబర్లకు ఆనుకొని ఉన్న ఎర్రకుంట, చెక్‌డ్యాంను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల పొలాల రైతులు, బీజేవైఎం నాయకులు మంగళవారం తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎర్రకుంట, చెక్‌డ్యాంలో వర్షపునీరు నిల్వ ఉంటే మూగజీవాల దాహార్తి తీరేందుకు ఇబ్బంది లేకుండా ఉండేదని తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, రైతులు రాజునాయక్, శ్రీను, శంకర్ ఉన్నారు.

● మండల కేంద్రంలో రాముల చెరువు నీరు సాఫీగా పారేందుకు ఏర్పాటు చేయాలని విజయటౌన్‌షిప్ కాలనీవాసులు, బీజేపీ నాయకులు కోరారు. కాలనీవాసులు, బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ రాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విజయటౌన్‌షిప్ కాలనీలోకి ఎగువన రాముల చెరువు ఉందని, వర్షం కురిసినప్పుడు ఆ నీరు పారేందుకు ఉన్న కాల్వలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల దిగువన ఉన్న విజయ టౌన్‌షిప్ కాలనీలోకి వస్తున్నదని వారు పేర్కొన్నారు. దీంతో కాలనీలోని ఇళ్ల వారికి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు చెరువు అలుగు ప్రదేశం నుంచి నీటిని ప్రత్యామ్నాయ మార్గంద్వారా మళ్లించేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, కాలనీవాసులు శ్రీనివాస్‌నాయక్, విజయ్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, సుదర్శన్, దేవేందర్ ఉన్నారు.

వీధికుక్కలను తరలించండి


జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 3 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో వీధి కుక్కలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యార్థులను వెంబడి పడి గాయపరుస్తున్నాయంటూ ప్రైవేట్ పాఠశాలల యజమానుల కమిటీ (ట్రస్మా) నాయకులు మంగళవారం జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమల బెడద అధికమైందని, పాఠశాలల చుట్టూ బ్లీచింగ్ పౌడర్ వేయించాలని కోరారు. మునిసిపాలిటీలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని, ఇప్పటికే విద్యార్థులను గాయపరిచిన సంఘటనలున్నాయని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ట్రస్మా జడ్చర్ల అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్, కోశాధికారి విష్ణు, వాసుదేవోజు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి : సీపీఐ

పాలమూరు, సెప్టెంబరు 3 : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను, వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పత్తి, మొక్కజొన్న, మిరప పంటలకు అపారమైన నష్టం జరిగిందన్నారు. ఆ పంటలకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. తక్షణ సహాయం కింద రూ.10వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. సమావేశంలో కె.రాము, చాంద్‌పాషా, శంకర్‌నాయక్, రాజు, రాజశేఖర్, వర్షనాయక్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ తరఫున వాటర్‌ట్యాంక్ వితరణ

పాలమూరు, సెప్టెంబరు 3 : వాసవీక్లబ్ వారోత్సవాలలో మూడోరోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈలో రక్తదానం చేపట్టారు. బోయపల్లి దగ్గర కోట మైసమ్మ దేవాలయానికి వాటర్‌ట్యాంక్ వాసవీక్లబ్ తరఫున వితరణ చేశారు. ఆకుతోట రాఘవేందర్ దంపతులు ప్రత్యేకంగా సహకారం అందజేశారని వాసవీక్లబ్ అధ్యక్షుడు కలకొండ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. రక్తదానం శిబిరంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన వి.శ్రీదేవిచంద్రశేఖర్, రామేశ్వర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. శిబిరంలో ఆర్య వైశ్యులు 50మంది పాల్గొని రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్, వనితక్లబ్ ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

జడ్చర్ల, సెప్టెంబరు 3 : ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ రోగాల బారిన ప్రజలు పడుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ కోరారు. గ్రామీణ ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించి వైద్యం అందించి, రోగాల బారి నుంచి కాపాడాలంటూ మంగళవారం జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డికి, జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్ అధికారి డాక్టర్ మనుప్రియలకు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేయాలని, దోమల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలలో దోమ తెరలను పంపిణీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు యాదయ్య, నర్సిములు, హవాజ్, మున్నా, మల్లేష్, వెంకటమ్మ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితిలో పేర్లు నమోదు చేసుకోవాలి


గణేష్ ఉత్సవ సమితి వారు పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ పత్రాన్ని జారీ చేస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 3 : ప్రతీ వినాయక మండపం వారు గణేష్ ఉత్సవ సమితిలో పేర్లు నమోదు చేసుకోవాలని ఉత్సవ సమితి కార్యాలయం ప్రముఖ్ అద్దెని నరేందర్, చాపల హనుమంతు తెలిపారు. మంగళవారం వీరు రాబోతున్న వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో ప్రతిష్ఠించే వినాయక మండపాల వారు వారి సంఘం పేరును గణేష్ ఉత్సవ సమితిలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ప్రక్రియ చేపట్టారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతీ మండపానికి ఉత్సవ సమితి నుంచి ధ్రువపత్రాన్ని జెండాలు, కండువాలు, టోపీలు, కరపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి ఉత్సవ సమితి తరఫున ధ్రువపత్రం, టోపీలు అందజేశారు.

సమస్యలు అధికారుల దృష్టికి తేవాలి

నవాబ్‌పేట, సెప్టెంబరు 3 : మండలంలో ఎక్కడైనా ప్రజల సమస్యలు ఎదుర్కొంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని కాకర్జాల, కాకర్జల తండా, కిషన్‌గూడ గ్రామాలలో ఏపీవో జ్యోతితో కలిసి పరిశీలించారు. కాకర్జాల తండాలో కొంత కాలంగా తాగునీటి సమస్య ఉందని తండావాసులు ఎంపీడీవో దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కిషన్‌గూడలో ఉపాధిహామీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా ఉందాం

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 : రాష్ట్రంలో వరద బాధితులకు అండగా ఉందామని ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐక్యచరణ సమితి ఆధ్వర్యంలో వరదబాధితుల సహాయార్థం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఒక రోజు బేసిక్‌పే చెల్లింపు చేయాలని కోరుతూ ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారిని మంగళవారం తెలంగాణ ఐక్యచరణ సమితి చైర్మన్ లచ్చిరెడ్డి కలిసి ఉత్తర్వులు జారీ చేయాలని కోరడం హర్షణీయమన్నారు.

వరద బాధితులకు సహాయంపై హర్షం

పాలమూరు, సెప్టెంబరు 3 : అకాలవర్షానికి నష్టానికి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ తరఫున ఒక్కరోజు మూలవేతనం రూ.వంద కోట్లు అందించటంపై టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజీవ్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్, కోశాధికారి డాక్టర్ కృష్ణమోహన్‌లు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వరదలకు ప్రాణనష్టం జరిగి నిరాశ్రయులైన వారికి ఆదుకోవటం మనవిధిగా భావించాలన్నారు.

విద్యా కమిషన్ ఏర్పాటు హర్షణీయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 3 : రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చేందుకు విద్యాకమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని, దీన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదేళ్ల తెలంగాణలో విద్యావిధానం నిర్వీర్యం అయ్యిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు సజావుగా చేపట్టిందని అన్నారు. డీఎస్సీ పరీక్ష నిర్వహించిందని, మౌలిక వసతుల కల్పనకు పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు .

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 3 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 5న నిర్వహించే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు ప్రతీ మండలం నుంచి ముగ్గురిని ఎంపిక చేసినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలును కలెక్టర్‌కు పంపినట్లు తెలి పారు. కలెక్టర్ నుంచి అప్రూవల్ అయి ఫైల్ రాగానే ఉపాధ్యాయుల ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించిన 38 జాబితాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు .